ఎస్సీ, ఎస్టీ (అత్యాచార నిరోధక) చట్టం

భారతీయ సమాజంలో షెడ్యూల్డ్ కులాలకు చెందినవారు తమ జీవనోపాధి కోసం కొనసాగించే వృత్తులను సమాజంలోని మిగతా వర్గాలు ఏవగించుకోవటం, షెడ్యూల్డ్ కులాలకు చెందినవారు వివక్షకు గురికావటం ఈ నాటికీ కొనసాగుతూనే ఉంది. వృత్తి ప్రాతిపదికగా ఈ కులాలకు చెందినవారిని అంటరాని వారుగా పరిగణిస్తున్నారు. రాజ్యాంగంలోని 17వ ప్రకరణ అంటరానితనాన్ని నిషేధించినప్పటికీ, తరతరాలుగా కొనసాగుతున్న ఈ దురాచారాన్ని నేటికీ పాటిస్తున్నారు. అస్పృశ్యతను పాటించడం వల్ల షెడ్యూల్డ్ కులాలకు చెందినవారు తోటివారితో సమానంగా పౌరహక్కులను అనుభవించలేకపోతున్నారు. పౌరహక్కుల పరిరక్షణ హక్కు 1955 ఈ వివక్షను రూపుమాపేందుకు ఉద్దేశించింది. 22 రాష్ట్రాల్లో/కేంద్రపాలిత ప్రాంతాల్లో అంటరానితనానికి గురైనవారికి ఉచిత న్యాయసహాయం అందిస్తున్నారు. 21 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో అంటరానితనానికి సంబంధించిన కేసులను న్యాయస్థానాలు పరిశీలించి సత్వరమే పరిష్కరించడం కోసం ప్రత్యేక విభాగాలు ఏర్పాటయ్యాయి.

షెడ్యూల్డు కులాలు, తెగలకు చెందినవారిలో క్రమేణా రాజకీయ చైతన్యం పెరుగుతోంది. అనేక సందర్భాల్లో ఈ కులాల వారికి మిగిలిన కులాలవారికి మధ్య ఘర్షణ తలెత్తుతోంది. వీరిమీద అకృత్యాలు కూడా పెరుగుతున్నాయి. వీటిని సాధ్యమైనంత వరకు నివారించడానికి, ఒకవేళ అఘాయిత్యాలు జరిపితే దానికి బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించడానికి, అపరాధాల వల్ల అత్యాచారాలకు గురైన వారికి పరిహారాన్నిస్తూ, పునరావాస చర్యలు చేపట్టడానికి ఉద్దేశించిన చట్టమే షెడ్యూల్డు కులాలు, తెగల (అత్యాచార నిరోధక) చట్టం. ఈ చట్టాన్ని అమలు చేయడం కోసం 1995లో విస్తృతమైన నియమ నిబంధనలు రూపొందించారు. ఆంధ్రప్రదేశ్‌తో సహా 11 రాష్ట్రాల్లో షెడ్యూల్డు కులాలు, తెగల మీద అత్యాచారాలు ఎక్కువగా జరుగుతున్నాయని నిర్ధారించారు. అత్యాచార నిరోధక చట్టాన్ని అమలు చేయడానికి అయ్యే ఖర్చును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 50:50 ప్రాతిపదికన భరిస్తాయి. కేంద్రంలో సామాజిక న్యాయమంత్రిత్వ శాఖ ఈ చట్టం అమలును పర్యవేక్షిస్తుంది.

రెండో అధ్యాయం..

ఈ చట్టంలోని రెండో అధ్యాయంలో అత్యాచారాలకు పాల్పడ్డవారికి విధించే శిక్షల గురించి వివరించారు.

ఎ) షెడ్యూల్డ్ కులాలు, తెగలకు చెందినవారి పట్ల ఇతర కులాలకు చెందినవారు కింద పేర్కొన్న వాటిలో ఏవిధంగా ప్రవర్తించినా వారికి ఆరునెలలకు తగ్గకుండా 5 సంవత్సరాల వరకు కారాగార శిక్ష విధిస్తారు.

- అభ్యంతకరమైన పదార్థాలను తినమని, ద్రవాన్ని తాగమని బలవంతం చేసినప్పుడు
- వారు నివసించే ప్రదేశంలో మలం, వ్యర్థ పదార్థాలు, జంతు కళేబరాలు విసిరినప్పుడు
- వివస్త్రలను చేయడం, ముఖానికి రంగు అద్ది వీధుల వెంట వారిని తిప్పుతూ అపహాస్యం చేసినట్లైతే
- వీరికి చెందిన భూమి, మరి ఇతర స్థిరాస్థులను బలవంతంగా ఆక్రమించుకున్నప్పుడు
- వీరు అనుభవిస్తున్న స్థిర, చరాస్తుల నుంచి వెళ్ల గొట్టినప్పుడు
- వెట్టిచాకిరి చేయించుకున్నప్పుడు
- ఓటుహక్కు వినియోగాన్ని అడ్డుకున్నప్పుడు
- వీరిపై తప్పుడు కేసులు మోపినప్పుడు
- వీరికి వ్యతిరేకంగా తప్పుడు సమాచారాన్ని ప్రభుత్వ ఉద్యోగులకు అందించి తద్వారా వారిని ఇబ్బంది పెట్టినప్పుడు
- బహిరంగ ప్రదేశాల్లో అవమానించినట్లైతే (కులం పేరుతో దూషించడం)
- మహిళలపై అత్యాచారానికి పాల్పడినప్పుడు
- తమ ఆధిపత్యాన్ని ఉపయోగించి మహిళలను లొంగదీసుకున్నప్పుడు
- వీరు ఉపయోగించే నీటిని కలుషితపరచినప్పుడు
- బహిరంగ ప్రదేశాలను (రోడ్లు మొదలైనవి) వినియోగించకుండా అడ్డంకులు కలిగించినప్పుడు
- తాము నివసిస్తున్న ఇంటిని, గ్రామాన్ని వదలిపొమ్మని బలవంతం చేసినప్పుడు

బి) ● షెడ్యూల్డ్ కులాలు/తెగలకు చెందని వారెవరైనా (ఇతరులు) షెడ్యూల్డు కులాలు, తెగలవారి మీద తప్పుడు సమాచారాన్ని ఉద్దేశపూర్వకంగా అందించి, వారికి యావజ్జీవ కారాగార వాసం లేదా మరణశిక్షకు దోహదం చేసినట్లైతే అందుకు కారకులైన వారికి మరణశిక్ష పడుతుంది.

- షెడ్యూల్డ్ కులాలు, తెగలకు చెందిన వారికి వ్యతిరేకంగా తప్పుడు సాక్ష్యమిచ్చి... వారికి ఏడేళ్ల లేదా అంతకంటే ఎక్కువ కాలం జైలుశిక్ష పడటానికి కారకులైతే, అందుకు బాధ్యులైన వారు అంతే కఠిన శిక్షతో పాటు జరిమానాకు గురవుతారు.
- వీరి ఆస్తులకు నష్టం కలిగించేవిధంగా పేలుడు పదార్థాలను వినియోగించినట్లైతే దానికి కారకులైన వారికి ఏడేళ్ల వరకు జైలుశిక్షతో పాటు, జరిమానా విధిస్తారు.

- వీరి ప్రార్థనా మందిరాలను, నివాస స్థలాలను పేలుడు పదార్థాలను ఉపయోగించి ధ్వంసం చేసినట్లైతే అందుకు బాధ్యులైనవారికి యావజ్జీవ కారాగార శిక్షతో పాటు జరిమానా విధిస్తారు.
- వీరికి చెందిన ఆస్తులను నష్టపరచటం లేదా వారిని వ్యక్తిగతంగా అవమానించినట్లైతే దానికి బాధ్యులైన వారికి యావజ్జీవ కారాగార శిక్షతో పాటు జరిమానా విధిస్తారు.
- ఇతర కులాలు, జాతులకు చెందిన ప్రభుత్వ ఉద్యోగి షెడ్యూల్డ్ కులాలు, జాతులకు చెందినవారి పట్ల అపరాధం చేస్తే ఏడాదికి తగ్గకుండా జైలుశిక్ష విధించే అవకాశముంది.
- ఇతర కులాలు, జాతులకు చెందిన ప్రభుత్వ ఉద్యోగి షెడ్యూల్డ్ కులాలు, జాతులకు చెందినవారికి అందించాల్సిన సేవల విషయంలో నిర్లక్ష్యం వహించినట్లయితే, ఆ ఉద్యోగికి ఒక ఏడాది వరకు జైలుశిక్ష విధించే అవకాశముంది.
- పైన పేర్కొన్న నేరానికి ఒకసారి, శిక్ష అనుభవించిన ప్రభుత్వ ఉద్యోగి రెండోసారి కూడా అదే నేరానికి పాల్పడితే ఆ ఉద్యోగికి మరోసారి ఏడాదికి తగ్గకుండా శిక్ష విధిస్తారు.

మూడో అధ్యాయం

మూడో అధ్యాయంలో షెడ్యూల్డ్ కులాలు/తెగల మీద అత్యాచారం చేసిన, లేదా చేసే అవకాశం ఉన్న వ్యక్తుల మీద విధించే బహిష్కరణకు సంబంధించిన వివరాలు పొందుపరిచారు. ఫిర్యాదు ఆధారంగా కానీ లేక తానే స్వయంగా సంతృప్తి చెందటం వల్ల కానీ, అత్యాచారాలకు పాల్పడే వ్యక్తులను రెండేళ్లకు మించకుండా ఆ ప్రాంతం నుంచి ప్రత్యేక న్యాయస్థానం బహిష్కరించవచ్చు. ఆ విధంగా బహిష్కరణకు గురైన వ్యక్తి ఆ ప్రాంతాన్ని వదలకపోతే, లేదా గడువు ముగియకముందే ఆ ప్రాంతానికి తిరిగివస్తే ఆ వ్యక్తిని నిర్బంధంలోకి తీసుకుని దూర ప్రాంతాలకు పంపిస్తారు. ప్రత్యేక న్యాయస్థానం విధించిన నిబంధనలను పాటించని వారికి ఏడాది పాటు కారాగార శిక్ష, జరిమానా విధిస్తారు.

నాలుగో అధ్యాయంలో ప్రత్యేక న్యాయస్థానానికి సంబంధించిన వివరాలు పొందుపరిచారు. షెడ్యూల్డ్ కులాలు/తెగలకు సంబంధించిన వారిమీద జరుగుతున్న అత్యాచారాలకు సంబంధించిన కేసుల సత్వర విచారణ కోసం రాష్ట్రప్రభుత్వం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆమోదంతో జిల్లాస్థాయిలో ప్రత్యేక న్యాయస్థానం ఏర్పాటు చేయవచ్చు. ఈ న్యాయస్థానానికి రాష్ట్రప్రభుత్వం ఏడేళ్ల అనుభవం ఉన్న న్యాయవాదిని పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమిస్తుంది. ప్రత్యేక న్యాయస్థానాల ఏర్పాటు, ప్రాసిక్యూటర్ నియామకాన్ని గజెట్‌లో ప్రచురిస్తారు.

ఐదో అధ్యాయంలో ఇతర విషయాలను వివరించారు. షెడ్యూల్డ్ కులాల/తెగల మీద అఘాయిత్యాలు జరిపే వ్యక్తుల మీద పౌరహక్కుల పరిరక్షణ చట్టం ప్రకారం సామూహిక జరిమానా విధిస్తారు. అఘాయిత్యాలు జరుగడానికి అవకాశం ఉందని భావించినప్పుడు జిల్లా మెజిస్ట్రేట్ లేక అధీనులు వాటిని నిరోధించడానికి తగిన చర్యలు తీసుకోవాలి.

ఈ చట్టాన్ని ప్రభావవంతంగా అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలి. అందులో భాగంగా బాధితులకు:

- ఉచిత న్యాయసలహాను అందించాలి
- బాధితులకు న్యాయస్థానాల ముందు హాజరు కావడానికి అయ్యే ఖర్చులను భరించాలి
- బాధితుల సామాజిక, ఆర్థిక పునరావాస చర్యలు చేపట్టాలి
- ఈ చట్టాన్ని అమలు చేయడం కోసం సంబంధిత అధికారులను నియమించాలి
- పునరావాస చర్యలను సక్రమంగా అమలు చేయడానికి కమిటీలు రూపొందించాలి
- ఈ చట్టం పనితీరును కాలానుగుణంగా సమీక్షించాలి

ఈ చట్ట నిబంధనలకు, ఇతర చట్ట నిబంధనలకు మధ్య ఘర్షణ అనివార్యమైతే ఈ చట్టానిదే పైచేయి.

ప్రాక్టీస్ ప్రశ్నలు...

1. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల వారి మీద అత్యాచారాలు జరిపిన వారి ఫోటోలు తీసుకొనే అధికారం పోలీసు అధికారికి ఏ సెక్షన్ ప్రకారం లభిస్తుంది?

ఎ) 10 బి) 11 సి) 12 డి) 13

2. అత్యాచారాలు జరిపిన వారిమీద 'సామూహిక జరిమానా' విధించే అధికారం ఎవరికుంది?

ఎ) ప్రత్యేక న్యాయస్థానానికి బి) రాష్ట్ర ప్రభుత్వానికి
సి) కేంద్ర ప్రభుత్వానికి డి) రాష్ట్ర హైకోర్టుకు

జవాబులు	1	2
	C	B